RNI NO : TELTEL/2023/88524

మెదక్ టుడే దిన పత్రిక

## మంచిమాట

ఆలోచించు. కానీ సమయం మించిపోకముందే ఆలోచనను కట్టిపెట్టి ఆచరణకు దిగు.

ఎడిటర్ : సిహెచ్. శివకుమార్ సంపుటి : 04 సంచిక : 229
మంగళవారం, ఆగస్టు 04, 2026 , పేజీలు - 4 వెల : 2/-

# కొత్త పెన్షన్లు అందేది వీరికే

కొత్త పెన్షన్ల పంపిణీ మార్గదర్శకాలు ఖరారయ్యాయి. ఆగస్టు 15 నుంచి చేయూత పథకం కింద కొత్త పింఛన్లు అందించనుంది.

**హైదరాబాద్, ఆగస్టు 3:** తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త పెన్షన్ల పంపిణీ మార్గదర్శకాలు ఖరారయ్యాయి. సీఎం రేవంత్ ఇప్పటికే కీలక ఆదేశాలు ఇచ్చారు. ఆగస్టు 15 నుంచి చేయూత పథకం కింద కొత్త పింఛన్లు అందించనుంది. వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులలో అర్హులైన వారందరికీ పింఛన్లు పంపిణీ చేయాలని డిసైడ్ అయ్యారు. దాదాపు పది లక్షల మందికి కొత్త పెన్షన్ల కోసం రూ 2,500 కోట్ల మేర ప్రభుత్వం పైన భారం పడుతుందని లెక్కలు తేల్చారు.తెలంగాణ ప్రభుత్వం ఆగస్టు 15 నుంచి కొత్త పెన్షన్ల పంపిణీకి రంగం సిద్దమైంది. కుల గణన లెక్కల మేర తేల్చిన అర్హులకు అనుగుణంగా కొత్త లబ్దిదారులను ఖరారు చేస్తున్నారు.



కొత్తగా తలసేమియా, సికిల్ సెల్ ఎనిమియా బాధితులకు కూడా పింఛన్లు అందిచాలని డిసైడ్ అయ్యారు. అందులో భాగంగా అర్హులను వెంటనే గుర్తించాలని సూచించారు. ఈ మేరకు తొలి దశలో సుమారు 2.5 లక్షల కొత్త పింఛన్లను మంజూరు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 42 లక్షల చేయూత పెన్షన్లు అందుతుండ గా.. కొందరు అనర్హులు పెన్షన్లు పొందుతున్నట్లు క్షేత్ర స్థాయి సమాచారం సేకరణలో తేలినట్లు చెబుతు న్నారు. వీరి పైన వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. కొత్త పెన్షన్ల ప్రక్రియ ప్రారంభానికి ముందే అనర్హులను గుర్తించి ఏరి వేయాలని భావిస్తున్నారు. కాగా.. 2026-27 వార్షిక బడ్జెట్ లోనూ కొత్త పెన్షన్ల పంపిణీ పైన ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది.కాగా, తాజాగా సీఎం రేవంత్ అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు.

### నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్

# శస్త్రచికిత్సలు పూర్తి

## : సీఎం రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 3 :** నిమ్స్‌లో రెండున్నరేళ్లలో వెయ్యి రొబోటిక్ శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్తి అయ్యాయని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డివ్యాఖ్యానించారు. ఈ ఘనత సాధించినందుకు నిమ్స్ డైరెక్టర్ రాహుల్ దేవరాజ్‌తో పాటు వైద్య బృందం, నర్సింగ్ సిబ్బంది, ఆపరేషన్ థియేటర్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సేవలను సామాన్య ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే ప్రజా ప్రభుత్వ సంకల్పం నెరవేరిందని వ్యాఖ్యానించారు.నిమ్స్‌లో ఇప్పటివరకు నిర్వహించిన రొబోటిక్ సర్జరీల్లో 90 శాతానికి పైగా ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఉచితంగా నిర్వహించడం ప్రత్యేకంగా అభినందించాల్సిన విషయమని సీఎం పేర్కొన్నారు. ఇటీవలే రెండు వేల కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను పూర్తి చేసిన నిమ్స్, ఇప్పుడు వెయ్యి రొబోటిక్ సర్జరీల మైలురాయిని చేరుకోవటం ద్వారా కొత్త రికార్డు నెలకొల్పిందని చెప్పుకొచ్చారు.

### అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి మోసం చేశారు..

# సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం



**హైదరాబాద్, ఆగస్టు 3 :** అసెంబ్లీలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి కాంగ్రెస్ నేతలు మోసం చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్‌లో ఈరోజు (సోమవారం) మీడియాతో కేటీఆర్ మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నియోజకవర్గం మధిరలో గడ్డం వేణు అనే యువకుడు ఆత్మహత్యాయత్నం చేసుకున్నారని ప్రస్తావించారు. రెండు పేజీల సూసైడ్ నోట్‌లో సీఎం, డిప్యూటీ సీఎం, రాహుల్‌గాంధీకి రాశారని.. ఈ లేఖను వారికి షేర్ చేయాలని ఆయన తన సూసైడ్ నోట్‌లో తెలిపారని అన్నారు. గడ్డం వేణు రాసింది సూసైడ్ నోట్ కాదని కాంగ్రెస్ పాలనపై ఛార్జ్‌షీట్ అని చెప్పుకొచ్చారు.యువత నిరాశ, నిస్పృహల్లో ఉన్నారు..వేణు రాసిన సూసైడ్ నోట్ సీఎం రేవంత్‌రెడ్డికి అందిందా...? రాష్ట్రంలో, దేశంలో యువత నిరాశ, నిస్పృహల్లో ఉన్నారని మాజీ మంత్రి కేటీఆర్ తెలిపారు. యూత్ డిక్లరేషన్ పేరుతో ఢిల్లీ నుంచి పెద్ద వాళ్లను తీసుకువచ్చి బిల్డప్పులు కొట్టారని ఎద్దేవా చేశారు. కేసీఆర్, కేటీఆర్ ఉద్యోగాలు ఊడగొడితే రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ నేతలు అనలేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎందుకు ఈ విషయంపై స్పందించడం లేదని నిలదీశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో రాహుల్ గాంధీ కనపడరని చెప్పు కొచ్చారు. సొంత నియోజకవర్గంలో యువకుడు ప్రశ్నల వర్షం కురిపించారు.

# ఆ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరం

## : కిషన్‌రెడ్డి



**ఢిల్లీ, ఆగస్టు 3 :** ప్‌సైడ్ కోల్ బ్లాక్ సింగరేణికి దక్కడం సంతోషకరమని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా సింగరేణి కార్మికులకు, కార్మికుల కుటుంబ సభ్యులకు, కార్మిక సంఘాల ప్రతినిధులకు, సింగరేణి అధికా రు లకు. తెలంగాణ ప్రజలకు అభినందనలు తెలిపారు. ఈ మేరకు కిషన్‌రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. ఇటీవల.. ఒడిశాలోని నైని కోల్ బ్లాక్, తాడిచర్ల -2 బ్లాక్ సింగరేణి సిగలో చేరిన సందర్భంలో.. ాఖూజ-2 డిప్ సైడ్ బ్లాక్‌ను కూడా సింగరేణికే దక్కేలా చొరవ తీసుకోవాలని కార్మికులు, యూనియన్ లీడర్ల నుంచి డిమాండ్లు వచ్చాయని ప్రస్తావించారు.ాఖూజ-2 డిప్‌సైడ్ బ్లాక్ సింగరేణికి వచ్చే విధంగా అన్నిరకాలుగా బాధ్యత వహించానని తెలిపారు. తాను కేంద్ర మంత్రిగానే కాకుండా తెలంగాణ బిడ్డగా.. సింగరేణి శ్రేయస్సు, అభివృద్ధి, సింగరేణి కార్మికులను ప్రేమించే వ్యక్తిగా ప్రత్యేక కృషి చేశానని చెప్పుకొచ్చారు.25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుంది..తన సహకారం ఫలితంగా సింగరేణి విజయం సాధించడం చాలా సంతోషకరమైన విషయమని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఈ నేపథ్యంలో ఇవాళ (3 ఆగస్టు, 2026) వేలం ప్రక్రియ పూర్తయిపోయిందని వెల్లడించారు. ఈ విధానంలో సింగరేణి సంస్థకు మణుగూరు ాఖూజ-2 డిప్‌సైడ్ బ్లాక్‌ను కేటాయిస్తున్నట్లు తెలిపారు. దక్షిణ భారతదేశంలో ఉన్న ఏకైక బొగ్గు ఉత్పత్తి సంస్థ అయిన సింగరేణి సంస్థ.. ఈ డిప్ సైడ్ బ్లాక్ వల్ల సుమారు 180 మిలియన్ టన్నుల బొగ్గు రిజర్వ్ ఉన్నాయని వెల్లడించారు. ఈ సంవత్సరానికి 6 మిలియన్ టన్నుల చొప్పున 25 ఏళ్లపాటు ఈ మైన్ నడుస్తుందని స్పష్టం చేశారు. 2వేల మందికి ఉద్యోగాలు...దాదాపు 2వేల మందికి ఉద్యోగాలు వస్తాయని కిషన్‌రెడ్డి వెల్లడించారు. ఇక్కడ దొరికే +-8 (మంచి క్వాలిటీ) బొగ్గు కారణంగా.. మొత్తం రూ. 43వేల కోట్లకు పైగా రెవెన్యూ జనరేట్ అవుతుందని చెప్పుకొచ్చారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 10,500 కోట్లకు మించి ఆదాయం కూడా వస్తుందని వివరించారు. తెలంగాణ ఇంధన భద్రతకు భరోసా దక్కడంతోపాటుగా.. సింగరేణి భవిష్యత్తు అభివృద్ధికి అవసరమైన వనరులు లభిస్తాయని వెల్లడించారు. ప్రభుత్వానికి, సింగరేణికి, విద్యుత్ రంగానికి, ఉద్యోగులకు మేలు జరుగుతుందని అ భిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వానికి దాదాపుగా రూ. 48వేల కోట్లకు పైగా ఆదాయం సమకూరుతుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# జోగినిలకు ప్రత్యేక గుర్తింపు..

# గుర్తింపు కార్డులు జారీ చేస్తాం!

## : మంత్రి పొన్నం


**హైదరాబాద్, ఆగస్టు 3:** లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి బోనాల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కీలక ప్రకటనలు చేశారు. జోగినిలకు ప్రత్యేక గుర్తింపు, గుర్తింపు కార్డుల జారీతో పాటు భవిష్యత్తులో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అన్నివిధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ రోజు తెలంగాణ ప్రజలందరికీ శుభదినమని అన్నారు. అమ్మవారి ఆశీర్వాదంతో రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ



సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల జాతర కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈసారి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో కొంత ఒత్తిడి ఏర్పడినా, దర్శనాలు సజావుగా జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేశారని చెప్పారు.జోగినిలకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలని వారు కోరిన విషయాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. భవిష్యత్తులో జోగినిలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని, వారికి గుర్తింపు కార్డులు జారీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని చెప్పారు. అలాగే మున్సిపల్ ఎన్నికల్లో వారిని కో-ఆప్షన్ సభ్యులుగా తీసుకునే దిశగా కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు. అమ్మవారికి సేవ చేసే వారికి మూడు శాఖల సమన్వయంతో లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా మరింత చేశారు.

### రంజాన్‌కు రూ.33 కోట్లు.. బోనాలకు రూ.20 కోట్లేనా..

# రేవంత్ సర్కార్‌పై బండి సంజయ్ ఫైర్



**హైదరాబాద్, ఆగస్టు 3:** బోనాల పండుగ నిధుల కేటాయింపుపై తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వివాదం చెలరేగింది. రంజాన్‌కు రూ. 33 కోట్లు కేటాయించిన రేవంత్ సర్కార్.. బోనాలకు రూ. 20 కోట్లు మాత్రమే ఇవ్వడం వివక్ష అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. హిందూ పండుగలకు జనాభా నిష్పత్తి ప్రకారం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించలేదని కూడా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు .తెలం గాణలో పండుగలకు నిధులు కేటాయించడంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఉద్దేశించి.. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. రంజాన్ పండుగ నిర్వహణకు రూ. 33 కోట్లు కేటాయించిన రేవంత్ రెడ్డి సర్కార్.. రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన బోనాల ఉత్సవాలకు కేవలం రూ. 20 కోట్లు మాత్రమే ఇవ్వడం సరైందేనా అని ప్రశ్నించారు.ఆదివారం ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న తర్వాత మీడియాతో మాట్లాడిన బండి సంజయ్.. తెలంగాణలో హిందూ పండుగలు, ఉత్సవాల నిర్వహణ పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని మండిపడ్డారు.

### ప్రజలను చంపాలనుకోవటం లేదు..

# ఇరాన్‌తో చర్చలపై ట్రంప్..



**అమెరికా:** అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో చర్చలపై క్లారిటీ ఇచ్చారు. ఈ రోజు (సోమవారం) నుంచే ఇరాన్‌తో అమెరికా చర్చలు ప్రారంభం అయ్యే అవకాశం ఉందని అన్నారు. తాను ప్రజలను చంపాలనుకోవటం లేదని తేల్చి చెప్పారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ట్రంప్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ..'ఇరాన్‌తో సోమవారం మధ్యాహ్నం నుంచి చర్చలు ప్రారంభం అయ్యే అవకాశం ఉంది. ఈ చర్చలు ఎలా సాగుతాయో వేచి చూడాలి. నేను ప్రజలను చంపాలనుకోవట్లేదు. ఎందుకంటే సైనిక దాడుల వల్ల చాలా మంది చనిపోతారు. అది నాకు ఇష్టం లేదు' అని స్పష్టం చేశారు.ఇరాన్‌పై దాడి తాత్కాలికంగా నిలిపివేతగత వారం ఇరాన్‌పై జరపాలనుకున్న అత్యంత భారీ సంయుక్త సైనిక దాడులను అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు తాత్కాలికంగా నిలిపివేశాయి. యుద్ధాన్ని ముగించేందుకు ఇరుపక్షాల మధ్య ఒక ప్రాథమిక శాంతి ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ప్రకటించారు.

# మరో జిల్లా పర్యటనకు వైఎస్ జగన్..

**అమరావతి:** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా దేవరపల్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని వైఎస్ జగన్ సందర్శిస్తారు. పొగాకు కొనుగోళ్లను పరిశీలించనున్న వైఎస్ జగన్ .. పొగాకు రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. ఈ విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తన అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వెల్లడించింది. జూలై 22వ తేదీ వివిధ జిల్లాల పొగాకు రైతులు జగన్‌ను కలిసి తమ బాధలు చెప్పుకున్న సంగతి తెలిసిందే.మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ బుధవారం రోజు తూర్పుగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా దేవరపల్లి పొగాకు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించనున్న జగన్, కొనుగోళ్ల తీరును పరిశీలించడంతోపాటు పొగాకు రైతులతో నేరుగా మాట్లాడనున్నారు. బుధవారం ఉదయం 9 గంటల 30 నిమిషాల సమయంలో వైఎస్ జగన్ తాడేపల్లిలోని తన నివాసం నుంచి బయలుదేరుతారు. ఉదయం 10.30 గంటలకు



దేవరపల్లి చేరుకుంటారు. అక్కడ పొగాకు కొనుగోలు కేంద్రంలో జరుగుతున్న కొనుగోళ్లను వైసీపీ అధినేత పరిశీలిస్తారు. అనంతరం పొగాకు రైతులతో ముఖాముఖి నిర్వహించనున్న జగన్.. పంట సాగు, గిట్టుబాటు ధర, కొనుగోళ్లు, ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలను అడిగి తెలుసుకుంటారు. రైతుల సమస్యలు, ఇబ్బందులపై వారితో చర్చిస్తారు. అనంతరం మధ్యాహ్నం దేవరపల్లి నుంచి తిరుగు ప్రయాణమవుతారని వైసీపీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది .మరోవైపు వివిధ జిల్లాలకు చెందిన పొగాకు రైతులు ఇటీవల వైఎస్ జగన్‌తో భేటీ అయిన సంగతి తెలిసిందే. పొగాకు ధరల సంక్షోభం, కొనుగోళ్లలో తీవ్ర జాప్యంపై తమ సమస్యలను జగన్ వద్ద ప్రస్తావించారు. వేలం ప్రారంభమై ఇన్ని రోజులు గడిచినా పొగాకు కొనుగోళ్లు పూర్తికాలేదని.. జులై నాటికి ముగియాల్సిన అమ్మకాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని జగన్ వద్ద ప్రస్తావించారు. కొన్ని వేలం కేంద్రాల్లో 30 నుంచి 40 శాతం వరకు నో బిడ్స్, రిజెక్షన్లు నమోదవుతున్నాయని.. తిరస్కరించిన ఒక్కో బేలును మళ్లీ వేలానికి తీసుకురావడానికి కనీసం రూ. 1,000 అదనపు భారం పడుతోందని వాపోయారు. ఒక్కో బ్యారన్‌పై రూ. 5 లక్షల వరకు నష్టం వచ్చే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

# అమీన్‌పూర్, బీరంగూడ పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టిన 'క్రేజీ క్రూ' కరాటే అకాడమీ విద్యార్థులు!






**అమీన్‌పూర్, ఆగస్టు 03:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ కేంద్రంగా పనిచేస్తున్న క్రేజీ క్రూ షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు హైదరాబాద్‌లోని చంపాపేట్ లక్ష్మీ గార్డెన్స్‌లో 2026 ఆగస్టు 1 మరియు 2 తేదీలలో నిర్వహించిన "2వ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్ – 2026" పోటీలలో మాస్టర్ జి. సంతోష్ రెడ్డి మార్గదర్శకత్వంలో అద్భుతమైన ప్రతిభను కనబరిచారు.
మన అకాడమీ విద్యార్థులు అత్యుత్తమ నైపుణ్యం, క్రమశిక్షణ మరియు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించి భారీ సంఖ్యలో పతకాలను కైవసం చేసుకున్నారు. స్వర్ణ పతక విజేతలు పెషిక, రేవంశ్, క్రిశాంక్,కీర్తి, సంజీత్ (2 స్వర్ణ పతకాలు), దేదీప్య,సమీక్ష,హర్షిత రెడ్డి, శ్రీయాంశ్. రజత పతక విజేతలుతేజ, నాగ సౌర్య, లియాంశ్,శివాంశ్ రెడ్డి, సుధా శ్రీ, శ్రీవల్లి, రామ్ చరణ్,లోహితాశ్,సృష్టి. కాంస్య పతక విజేతలుప్రణిత, నిక్షయ్,లిఖిల్, మాన్య,అవ్యక్త్ , తన్విత, దేదీప్య, నితీశ్, రేవంశ్, యశ్విక, చైతన్ సాయి, చైతన్ రిత్విక్, లిఖిత.వెపన్ కటా పతక విజేతలుస్వర్ణం పెషిక, రజతం లిఖిత,కాంస్యం సమీక్ష.ఈ సందర్భంగా అకాడమీ ఫౌండర్ మరియు డైరెక్టర్ మాస్టర్ జి. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ..."మన అమీన్‌పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ ప్రాంతం నుండి అంతర్జాతీయ స్థాయికి వెళ్లిన మన అకాడమీ విద్యార్థులు ఈ పోటీలలో చూపిన ప్రతిభ నిజంగా గర్వకారణం. పతకాలు సాధించిన ప్రతి ఒక్క విద్యార్థి తమ కఠోర శ్రమ, పట్టుదల ఏంటో నిరూపించారు. కేవలం గెలవడమే కాకుండా, పిల్లలు ప్రదర్శించిన ఆత్మరక్షణ నైపుణ్యాలు మరియు క్రీడాస్ఫూర్తి అభినందనీయం.ఈ విజయాల వెనుక పిల్లల కష్టంతో పాటు, వారిని నిరంతరం వెన్నుతట్టి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రుల పాత్ర ఎంతో ఉంది. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నాను. మన బీరంగూడ అకాడమీ నుంచి భవిష్యత్తులో జాతీయ మరియు అంతర్జాతీయ వేదికలపై మరిన్ని పతకాలు సాధించేలా విద్యార్థులను మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుతాము. మన పిల్లలందరూ ఇదే ఉత్సాహంతో మరిన్ని శిక్షణలు తీసుకుంటూ, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. మన ప్రాంతానికి, అకాడమీకి పేరు ప్రఖ్యాతులు తెచ్చిన పతక విజేతలందరికీ మరియు వారిని వెన్నుదన్నుగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ప్రత్యేక అభినందనలు.

# చేగుంటలో శ్రీ వసుధ మెస్ ఫ్యామిలీ రెస్టారెంట్ ప్రారంభం

**- యూనియన్ బ్యాంక్ ఎదురుగా,**
**- 5 కిలోమీటర్ వరకు ఫ్రీ హోమ్ డెలివరీ**



**చేగుంట ఆగస్టు 03 మెదక్ టుడే న్యూస్**
చేగుంట పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన వసుధ మెస్ ఫ్యామిలీ రెస్టారెంట్ ను ప్రముఖులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా రెస్టారెంట్ యజమానులు శ్రీకాంత్, నవీన్ విచ్చేసిన అతిథులకు శాలువాలతో ఘన స్వాగతం పలికి సన్మానించారు.ప్రారంభోత్సవంలో పాల్గొన్న ప్రముఖులు మాట్లాడుతూ, పట్టణ మధ్యలో ఈ రెస్టారెంట్ ప్రారంభం కావడం అభినందనీయమని, ఇక్కడికి వచ్చే కస్టమర్లకు రుచికరమైన, ఆరోగ్యకరమైన భోజనం అందించాలని సూచించారు.యాజమాన్యం మాట్లాడుతూ... "కుటుంబాలకు అనువుగా హోమ్ స్టైల్ భోజనం అందిస్తాము. రెస్టారెంట్ నుండి 5 కిలోమీటర్ల పరిధిలో ఉచిత ఫుడ్ డెలివరీ సౌకర్యం కల్పించాము. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, ప్రజా ప్రతినిధులు స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# అమీన్ పూర్: చిట్టీల పేరిట కోట్లాది రూపాయలతో దంపతుల పరారీ... భయాందోళనలో బాధితులు










**అమీన్ పూర్, ఆగస్టు 03:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అమీన్ పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మోసం వెలుగు చూసింది. చిట్టీల పేరిట అమాయక ప్రజల నుండి కోట్లాది రూపాయలు వసూలు చేసిన ఓ భార్యాభర్తల జంట రాత్రికి రాత్రే బోర్డు తిప్పేసింది. స్థానికుల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని ఏకంగా రూ.2.5 కోట్లకు పైగా టోకరా వేసిన ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.సంఘటన వివరాలు:పోలీసులు మరియు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా చిలకలూరిపేటకు చెందిన సాంబశివరావు, శిరీష దంపతులు గత 20 సంవత్సరాలుగా అమీన్ పూర్ పరిధిలోని బి.ఎస్.ఆర్. కాలనీలో నివాసముంటున్నారు. ఇతరులతో సులభంగా కలిసిపోయే ఈ దంపతులు కాలనీవాసులతో మంచి సంబంధాలు ఏర్పరచుకున్నారు.ఈ పరిచయాల నమ్మకాన్ని ఆసరాగా చేసుకుని వారు కొద్దికాలంగా చిట్టీల వ్యాపారం ప్రారంభించారు. ప్రతి నెలా క్రమం తప్పకుండా డబ్బులు వసూలు చేస్తూ వచ్చారు. మొదట్లో కొన్నేళ్ల పాటు లావాదేవీలు సక్రమంగా నిర్వహించడంతో కాలనీవాసులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల వారు కూడా వారిపై నమ్మకంతో లక్షలాది రూపాయలను చిట్టీల రూపంలో జమ చేశారు.రాత్రికి రాత్రే ఇల్లు ఖాళీ చేసి పరారీ:చిట్టీల గడువు ముగిసి, బాధితులకు డబ్బులు వెనక్కి ఇవ్వాల్సిన సమయం ఆసన్నం కావడంతో ఆ భార్యాభర్తలు దాటవేత ధోరణి మొదలుపెట్టారు. ఎవరికీ ఎలాంటి అనుమానం రాకుండా తమ సొంత ఇల్లును విక్రయించారు. ఆపై ఎవరికీ చెప్పకుండా రాత్రికి రాత్రే ఇల్లు ఖాళీ చేసి, తమ మొబైల్ ఫోన్లను స్విచ్ ఆఫ్ చేసి పరారయ్యారు.మరుసటి రోజు ఉదయం బాధితులు వారి ఇంటికి వెళ్లి చూడగా తాళం వేసి ఉండటంతో తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమన్నారు. తాము కష్టపడి దాచుకున్న సొమ్ము దాదాపు రూ.2.5 కోట్లకు పైగా క్షణాల మీద కోల్పోవడంతో బాధితులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.పోలీసుల దర్యాప్తు ముమ్మరం:ఈ మోసంపై బాధితులంతా కలిసి సుమారు 20 మందికి పైగా అమీన్ పూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు అమీన్ పూర్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపారు. పరారీలో ఉన్న సాంబశివరావు, శిరీష దంపతుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. నిందితులను త్వరలోనే పట్టుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# బీరంగూడలో : శ్రీ కనకదుర్గ డ్రై క్లీనింగ్ లాండ్రీ షాప్ దగ్ధం.. షార్ట్ సర్క్యూట్‌తో 3 నుంచి 4 లక్షల రూపాయలు నష్టపోయినట్లు ఓనర్ విష్ణు ఆవేదన!






**అమీన్‌పూర్ ఆగస్టు 03:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్‌పూర్ జీహెచ్ఎంసీ పరిధిలోని బీరంగూడ డివిజన్ పరిధిలో ఉన్న జయలక్ష్మీ నగర్ కాలనీలో ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. కాలనీలోని రోడ్డు నంబర్ 3 లక్ష్మీనగర్ లో గల 'శ్రీ కనకదుర్గ డ్రై క్లీనింగ్ ఒ లాండ్రీ' షాపులో అకస్మాత్తుగా విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ఏర్పడి షాప్ అంతా కలగపడింది. ఈ ప్రమాదంలో షాప్ పూర్తిగా దగ్ధమైంది.లాండ్రీ షాప్ ఓనర్ విష్ణు తెలిపిన వివరాల ప్రకారం.. ఉదయం సుమారు 7:00 నుండి 7:30 గంటల ప్రాంతంలో ఈ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. షాప్ ముందు ప్రాంతంలో ఉన్న స్థానికులు వెంటనే స్పందించి ఫోన్ చేసి సమాచారం అందించడంతో తాను అక్కడకు చేరుకునేసరికి షాప్‌లోని వస్తువులన్నీ పూర్తిగా కాలిపో యాయి.ఈ ప్రమాదంలో సుమారు 70 నుంచి 80 జతల కస్టమర్ల బట్టలు, డ్రై వాష్ మరియు ఐరన్ బట్టలు, ఇనుప మడతలు అన్నీ అగ్నికి ఆహుతయ్యాయని ఓనర్ విష్ణు తెలిపారు. ఈ సంఘ టన ద్వారా తాను 3 నుంచి 4 లక్షల రూపాయలు నష్టపోయినట్టు ఆయన కన్నీటిపర్య ంతమయ్యాడు. ప్రభుత్వం మరియు అధికారులు స్పందించి తమను ఆదుకోవాలని విష్ణు విజ్ఞప్తి చేశారు.

# గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయం: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్‌చెరు, ఆగస్టు 03:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు నిరంతరం శ్రమించాలని పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ఆదేశించారు. ప్రధానంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.సోమవారం సాయంత్రం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పటాన్‌చెరు, గుమ్మడిదల మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీవోలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో ఎమ్మెల్యే జీఎంఆర్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామణాభివృద్ధికి ప్రభుత్వ నిధులతో పాటు సీఎస్ఆర్ నిధులను సైతం వెచ్చిస్తామని తెలిపారు. క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. గ్రామస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే వాటిని వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తానని భరోసానిచ్చారు.

త్వరలో నందిగామ షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభం



నందిగామ గ్రామపంచాయతీ పరిధిలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ పెండింగ్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రాబోయే పది రోజుల్లో దీన్ని ప్రారంభించనున్నట్లు తెలిపి, దీని ద్వారా గ్రామపంచాయతీకి ప్రతినెల స్థిరమైన ఆదాయం సమకూరుతుందని పేర్కొన్నారు. అలాగే భానూరు, క్యాసారం, నందిగామ గ్రామపంచాయతీ నిధులతో నూతన అభివృద్ధి కార్యక్రమాలకు రూపకల్పన చేయాలని సూచించారు.

నిర్లక్ష్యం చేస్తే కాంట్రాక్టర్లు బ్లాక్‌లిస్ట్‌లో..

గుమ్మడిదల మండల పరిధిలోని అనంతారం, కానుకుంట, నూతనకల్, కొత్తపల్లి తదితర గ్రామాల్లో అంతర్గత రహదారుల నిర్మాణానికి హెచ్ఎండీఏ ద్వారా నిధులు మంజూరయ్యాయని పీఆర్ డీఈ దీపక్ తెలిపారు. టెండర్లు పూర్తయినప్పటికీ పనులు ప్రారంభించని పక్షంలో సంబంధిత కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని ఎమ్మెల్యే అధికారులను హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. గ్రామణాభివృద్ధి లక్ష్యంగా అందరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమా వేశంలో ఎంపీడీవోలు యాదగిరి, ఉమాదేవి, పీఆర్ డీఈ దీపక్, ఎంపీవో హరిశంకర్ గౌడ్, ఏఈ శశిధర్ రెడ్డి పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# వర్షాలతో పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించిన సర్పంచ్

**- పోలంపల్లిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం**



**చేగుంట ఆగస్టు 03 మెదక్ టుడే న్యూస్**
చేగుంట మండలం పోలంపల్లి గ్రామంలో వరుస వర్షాలతో వీధులు, మురుగు కాలువల్లో పెరిగిన పిచ్చి మొక్కలను సోమవారం సర్పంచ్ కొండె రాజ్యలక్ష్మి స్వామిపంచాయతీ సిబ్బందితో కలిసి తొలగించారు.గ్రామంలో దోమలు, కీటకాల బెడద లేకుండా ఉండేందుకు యంత్రాలతో మొక్కలు క్లియర్ చేయించి, ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ కొండె రాజ్యలక్ష్మి మాట్లాడుతూ, వర్షాకాలంలో అంటురోగాలు రాకుండా ఉండాలంటే గ్రామ పరిశుభ్రత చాలా ముఖ్యమని అన్నారు. ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేరు చేయాలని, ఇంటి చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూడాలని, ప్లాస్టిక్ వ్యర్థాలు, పాత కుండలు, టైర్లు వంటివి వెంటనే తొలగించాలని ప్రజలకు సూచించారు.గ్రామ అభివృద్ధిలో ప్రజల సహకారం తప్పనిసరి అని, అందరూ పంచాయతీకి సహకరించాలని కోరారు.

# మహిళా సంఘాల సంతకాల ఫోర్జరీ

**- రూ.21 లక్షల రుణం తీసుకున్న విఓఏ**
**- కలెక్టర్‌కు మహిళల ఫిర్యాదు**

**టేక్మాల్, :** మెదక్ జిల్లా టేక్మాల్ గ్రామపంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్‌ను ప్రజావాణి కార్యక్రమంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. తమకు తెలియకుండా మహిళా సంఘాల సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి, శ్రీనిధి ద్వారా రూ.21 లక్షల రుణం తీసుకున్నారని గ్రామ విఓఏ ఆంజనేయులుపై వారు ఫిర్యాదులో ఆరోపించారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మహిళలు కలెక్టర్‌ను కోరారు. తమ పేర్లపై తీసుకున్న రుణాల కారణంగా తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదును స్వీకరించిన కలెక్టర్ ప్రతిమ సింగ్ సంబంధిత అధికారులతో విచారణ జరిపించి, వాస్తవాలను నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు సమాచారం. మహిళల ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, సంబంధిత అధికారుల విచారణ అనంతరం పూర్తి వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం

# అవయవ దానంపై అవగాహన - కిమ్స్ ఆధ్వర్యంలో 'అంగదాన్ జీవన్ సంజీవని అభియాన్' కార్యక్రమం



**హైదరాబాద్:** అవయవ దానం చేయడం ద్వారా ఒక వ్యక్తి మరణానంతరం కూడా పలువురికి జీవం ప్రసాదించగలమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సమాజంలో అవయవ దానంపై ఉన్న అపోహలను తొలగించేందుకు విస్తృత అవగాహన అవసరమని చెప్పారు. జాతీయ స్థాయి అవయవ దాన అవగాహన కార్యక్రమం 'అంగదాన్ జీవన్ సంజీవని అభియాన్?'లో భాగంగా కిమ్స్? కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కిమ్స్ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఛైర్మన్ అండ్? మేనేజింగ్ డైరెక్టర్ డా. బి. భాస్కరరావు పాల్గొన్నారు. కిమ్స్ హాస్పిటల్స్, నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్‌ఎస్‌ఎస్), కిమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో కిమ్స్ హాస్పిటల్స్ సికింద్రాబాద్?లో ఈ కార్యక్రమం జరిగింది. "అవయవ దానం -- ప్రాణదానం చేయండి, మానవత్వపు వారసత్వాన్ని నిలబెట్టండి" అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.మానవతా సేవలో అత్యున్నతమైన కార్యం : అవయవ దానం అనేది మానవతా సేవలో అత్యున్నతమైన కార్యమని కిమ్స్ మెడికల్ ఎడ్యుకేషన్ (అకాడెమిక్స్) డైరెక్టర్ డా. ఎస్. మణిమాల రావు పేర్కొన్నారు. సమాజంలో ప్రతి కుటుంబం ఈ విషయంపై చర్చించాల్సిన అవసరం ఉందని అన్నారు. మరణానంతరం అవయవ దానం చేయాలనే సంకల్పం ఎన్నో కుటుంబాలకు కొత్త ఆశను ఇస్తుందని చెప్పారు.ఎనిమిది మందికి ప్రాణదానం : గుండె, ఊపిరితిత్తుల మార్పిడి నిపుణుడు డా. సందీప్ అట్టావర్ మాట్లాడుతూ బ్రెయిన్ డెత్ అనంతరం జరిగే అవయవ దానం ద్వారా గుండె, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు వంటి కీలక అవయవాలను అవసరమైన రోగులకు మార్పిడి చేసి ప్రాణాలు కాపాడవచ్చని వివరించారు. ఒక అవయవ దాత ఎనిమిది మందికి ప్రాణదానం చేయడంతో పాటు 50 మందికి పైగా జీవన నాణ్యతను మెరుగుపరచగలడని స్పష్టం చేశారు.విద్యాసంస్థలు ముందుకు రావాలి : ఇప్పుడిప్పుడే ప్రజల్లో అవయవాల మార్పిడిపై అవగాహ వస్తోందని కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ డాక్టర్. సహారియా, డాక్టర్. ఉమ మహేశ్వరరావులు అన్నారు. వీటిపై ఇంకా మరింతగా అవగాహన రావాలని చెప్పారు. అవయవాల మార్పిడితో జీవన నాణ్యత పెరుగుతుందన్నారు. యువతలో అవయవ దానంపై సానుకూల దృక్పథం పెంపొందించేందుకు విద్యాసంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.కుటుంబ సభ్యులకు సత్కారం : కిమ్స్ హాస్పిటల్స్ సికింద్రాబాద్ సీఓఓ డా. సౌరబ్ లాల్ మాట్లాడుతూ నర్సింగ్ విద్యార్థులు సమాజంలో అవయవ దాన సందేశాన్ని తీసుకెళ్లే రాయబారులుగా పనిచేయాలని సూచించారు. ఆర్గాన్ డోనేషన్, కెడవార్ ట్రాన్స్ ప్లాంట్ సర్వీస్ ప్రెసిడెంట్ కె. మంగాదేవి ఆధ్వర్యంలో అవయవదానం చేసిన వారికి, ఆయా కుటుంబ సభ్యులకు సత్కారం చేశారు.వైద్య ప్రక్రియలపై నిపుణులు అవగాహన : ఈ కార్యక్రమంలో అవయవ దాన ప్రాముఖ్యత, దాత నమోదు విధానం, బ్రెయిన్ డెత్ అనంతరం అనుసరించే వైద్య ప్రక్రియలపై నిపుణులు అవగాహన కల్పించారు. విద్యార్థులు అవయవ దాన ప్రతిజ్ఞ చేసి అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షురాలు డా. హారిణి చెబ్రోలు, అధ్యపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. చివరగా నిర్వాహకులు మాట్లాడుతూ "అవయవ దానం మహాదానం, ఒక నిర్ణయం ఎన్నో ప్రాణాలను కాపాడగలదు" అనే సందేశాన్ని ప్రతి కుటుంబానికి చేరవేయాలని కోరారు.

# అమీన్ పూర్ విద్యార్థుల ఉత్సాహభరిత వాతావరణంలో క్రికెట్ టోర్నమెంట్..

**- ముఖ్య అతిథిగా పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్**





**అమీన్ పూర్ ఆగస్టు 03:(మెదక్ టుడే) న్యూస్ ప్రతినిధి**
అమీన్ పూర్ జిహెచ్ఎంసి పరిధిలోని బీరంగూడ డివిజన్‌లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్ అత్యంత ఉత్సాహంగా సాగింది. ఈ క్రీడా వేడుకకు బిఆర్ఎస్ నాయకులు ఐలాపూర్ మాణిక్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్‌లో పాల్గొన్న చిన్నారులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ... దేశ భవిష్యత్తుకు విద్య, క్రీడలు రెండు కళ్ల లాంటివని పేర్కొన్నారు. భారత రాజ్యాంగం అందించిన విద్యా హక్కు ద్వారా ప్రతి చిన్నారి నాణ్యమైన విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. చదువు మనిషి జీవితాన్ని తీర్చిదిద్దడంతో పాటు, దేశ పురోగతికి బలమైన మానవ వనరులను సమకూరుస్తుందని వివరించారు.కేవలం చదువు మాత్రమే కాకుండా, క్రీడలు విద్యార్థుల శారీరక మరియు మానసిక వికాసానికి ఎంతగానో దోహదపడతాయని మాణిక్ యాదవ్ స్పష్టం చేశారు. క్రీడల ద్వారా విద్యార్థులలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, సమిష్టి భావన పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులందరూ చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను చాటి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.అనంతరం టోర్నమెంట్‌లో ఉత్సాహంగా పాల్గొన్న చిన్నారులందరినీ ప్రత్యేకంగా అభినందించారు. వారి ప్రతిభను ప్రశంసించి, విజేతలకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక క్రీడాకారులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# రూ.87 కోట్ల ప్రభుత్వ ధాన్యం మాయం

**- సీఎంఆర్ బియ్యం పక్కదారి.. మూడు రైస్ మిల్లులపై విజిలెన్స్ కొరడా**
**- రైస్ మిల్లర్ కొండ లక్ష్మణ్ సహా పలువురిపై క్రిమినల్ కేసులు నమోదు**





**జగిత్యాల,ఆగస్టు,3,మెదక్ టుడే:(స్టేట్ బ్యూరో)**
జగిత్యాల జిల్లాలో ప్రభుత్వానికి సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) కింద అప్పగించాల్సిన సుమారు రూ.87 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా పక్కదారి మళ్లించిన వ్యవహారం వెలుగులోకి రావడంతో జిల్లాలో సంచలనం నెలకొంది.విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో ఈ అక్రమాలు బయటపడగా, సంబంధిత రైస్ మిల్లుల యాజమాన్యాలపై క్రిమినల్ చర్యలు ప్రారంభమయ్యాయి. విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ అదనపు ఎస్పీ బసవరెడ్డి ఆధ్వర్యంలో జిల్లా సివిల్ సప్లై అధికారి ఎస్. జితేందర్ రెడ్డి, ఎన్ఫోర్స్మెంట్ అధికారుల బృందం జగిత్యాల జిల్లాలోని శ్రీ అభయాంజనేయ సాయి రైస్ మిల్, శ్రీ లక్ష్మీ బాలాజీ ఇండస్ట్రీస్, లక్ష్మీ గణపతి ఇండస్ట్రీస్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. రికార్డులు, నిల్వలు, ధాన్యం లెక్కలను పరిశీలించిన అధికారులు ప్రభుత్వానికి అప్పగించాల్సిన సీఎంఆర్ ధాన్యాన్ని నిబంధనలకు విరుద్ధంగా మళ్లించినట్లు గుర్తించారు. ప్రాథమిక విచారణలో సుమారు రూ.87 కోట్ల విలువైన ప్రభుత్వ ధాన్యం అక్రమంగా మళ్లించినట్లు నిర్ధారణకు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

**కలెక్టర్ ఆదేశాలతో కేసుల నమోదు**

ఈ అక్రమాలపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో రైస్ మిల్లర్ కొండ లక్ష్మణ్‌తో పాటు సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ ధాన్యం అక్రమాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని అధికారులు స్పష్టం చేశారు.

**సమగ్ర దర్యాప్తు కొనసాగుతోంది**

ప్రభుత్వ ధాన్యం అక్రమాల వెనుక మరికొందరి ప్రమేయం ఉందా అనే కోణంలో కూడా అధికారులు విచారణ చేపట్టారు.ధాన్యం సేకరణ, నిల్వలు,మిల్లింగ్, సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి అప్పగింత వరకు జరిగిన మొత్తం ప్రక్రియను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. దర్యాప్తులో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

# హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ ముమ్మర కసరత్తు

**- పోటీలో పలువురు ఆశావహులు ప్రధానంగా నలుగురు బలమైన పేర్లపై పార్టీ దృష్టి**



**(స్పెషల్ కరస్పాండెంట్)హైదరాబాద్,ఆగస్టు,3, (మెదక్ టుడే)**
వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నిక రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తోంది. అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలతో పాటు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కూడా ఈ ఎన్నికను అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తూ వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది.

ప్రస్తుతం ఈ స్థానానికి ప్రాతినిధ్యం వహిస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ సురభి వాణీదేవి ప్రజా సమస్యలపై ఆశించిన స్థాయిలో చురుకుగా వ్యవహరించలేదనే అభిప్రాయం పట్టభద్రుల్లో వ్యక్తమవుతోందని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికార ప్రభావం, భారీ ధనబలం మధ్య కూడా బీజేపీ సీనియర్ నాయకుడు ఎన్. రామచందర్ రావు స్వల్ప ఓట్ల తేడాతో పరాజయం పాలయ్యారని, ఈసారి రాజకీయ పరిస్థితులు గణనీయంగా మారాయని పార్టీ నేతలు విశ్వసిస్తున్నారు.యువత, నిరుద్యోగం, విద్యా రంగ సమస్యలు ప్రధాన ఎన్నికల అజెండాగా మారుతున్న నేపథ్యంలో ప్రజల్లో గుర్తింపు, సిద్ధాంతపరమైన స్పష్టత, ప్రజా సమస్యలపై గళం విప్పగల సామర్థ్యం కలిగిన నాయకుడిని బరిలో దింపాలనే అభిప్రాయం బీజేపీ అంతర్గతంగా బలంగా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా దక్షిణ తెలంగాణలో పార్టీ స్వరాన్ని సమర్థంగా వినిపించే నాయకత్వంపై అధిష్ఠానం దృష్టి సారించినట్లు తెలుస్తోంది.ప్రధానంగా వినిపిస్తున్న నలుగురు పేర్లు

నెల్లి శ్రీవర్ధన్ రెడ్డి:ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజా జీవితంలోకి వచ్చిన ఆయన 2007, 2011 టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి పాలయ్యారు.అనంతరం 2014, 2018 శాసనసభ ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేశారు. 2023 ఎన్నికల్లో పార్టీ నిర్ణయానికి కట్టుబడి పార్టీ విజయానికి కృషి చేశారు.విద్యార్థి దశ నుంచే ఏబీవీపీ నాయకుడిగా ఎదిగిన ఆయన ఆర్ఎస్ఎస్ భావజాలంతో బీజేపీలో ఉద్యమ నాయకుడిగా గుర్తింపు పొందారు. తెలంగాణ విమోచన యాత్ర ద్వారా సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలనే డిమాండ్‌ను జాతీయ స్థాయికి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారు. విద్యా రంగంలో పలు విద్యాసంస్థలను స్థాపించి వేలాది మంది విద్యార్థులకు విద్య అందించడంతో పాటు ప్రైవేట్ విద్యాసంస్థలతో సన్నిహిత అనుబంధాన్ని ఏర్పరుచుకున్నారు.డాక్టర్ పి. భాస్కరయోగి: రచయిత, వక్త, కాలమిస్ట్‌గా ప్రత్యేక గుర్తింపు పొందిన ఆయన జాతీయవాద, హిందుత్వ భావజాల ప్రచారంలో చురుకుగా వ్యవహరిస్తున్నారు. జూనియర్ కళాశాల అధ్యాపకుడిగా పనిచేసిన అనుభవంతో ఉపాధ్యాయ వర్గాల్లో మంచి ఆదరణ కలిగి ఉన్నారు. ఆర్ఎస్ఎస్‌తో పాటు పలు ఆధ్యాత్మిక సంస్థలతో ఆయనకు ఉన్న అనుబంధం ప్రత్యేక బలంగా పరిగణించబడుతోంది.డాక్టర్ ఎస్. మల్లారెడ్డి:బీజేపీ సీనియర్ నాయకుడైన ఆయన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. రాష్ట్ర పార్టీ నాయకత్వంతో ఉన్న సన్నిహిత సంబంధాలు, సుదీర్ఘ రాజకీయ అనుభవం ఆయనకు అనుకూల అంశాలుగా భావిస్తున్నారు.

సుధాకర్ రావు:కొల్లాపూర్ నుంచి రెండుసార్లు శాసనసభకు పోటీ చేసిన ఆయన విద్యుత్ శాఖలో ఉద్యోగిగా పనిచేసి ఉద్యోగ సంఘ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఉద్యోగ వర్గాల్లో విస్తృత పరిచయాలు, సంఘటిత వర్గాలతో అనుబంధం ఆయనకు బలంగా కనిపిస్తున్నాయి.ఈ నలుగురితో పాటు మరికొందరు నాయకుల పేర్లు కూడా పరిశీలనలో ఉన్నప్పటికీ, పార్టీతో సుదీర్ఘ అనుబంధం, సిద్ధాంతపరమైన నిబద్ధత, ప్రజల్లో గుర్తింపు, ఉద్యమ అనుభవం వంటి అంశాలకే ఈసారి అధిక ప్రాధాన్యం దక్కే అవకాశముందని బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రజల్లో గుర్తింపు ఉన్న నాయకుడికే ప్రాధాన్యం

ప్రస్తుతం బీజేపీకి శాసనమండలిలో ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నప్పటికీ, ప్రజా వేదికలపై పార్టీ తరఫున బలంగా మాట్లాడగల నాయకత్వం అవసరమనే అభిప్రాయం కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. నిరుద్యోగం, విద్య, యువత సమస్యలను సమర్థంగా ప్రస్తావించడంతో పాటు ప్రత్యర్థి వాదనలను సమర్థవంతంగా ఎదుర్కొనే మేధో సామర్థ్యం కలిగిన అభ్యర్థినే ఎంపిక చేయాలన్న డిమాండ్ కిందిస్థాయి నాయకత్వం నుంచి వినిపిస్తోంది.కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యూహాలుకాంగ్రెస్ పార్టీ బీసీ వర్గానికి చెందిన అభ్యర్థిని పరిశీలిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు బీఆర్ఎస్ కూడా ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అన్ని విధాలుగా గెలుపు కోసం వ్యూహాలు రచిస్తున్నట్లు సమాచారం.బీజేపీకి సిద్ధాంతపరమైన అవకాశం?గత ఎన్నికల్లో పరిమిత వనరులతోనే ఎన్. రామచందర్ రావు బలమైన పోటీ ఇవ్వగలిగారని, ఈసారి ప్రభుత్వ వ్యతిరేకత, యువతలో మారుతున్న రాజకీయ దృక్పథం, సిద్ధాంతపరమైన ఓటు సమీకరణం కలిసి వస్తే బీజేపీకి అనుకూల వాతావరణం ఏర్పడే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

మొత్తంగా హైదరాబాద్--రంగారెడ్డి--మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో "డబ్బు, బయటి ప్రభావం కంటే సిద్ధాంతం, ప్రజల్లో గుర్తింపు, ప్రజా స్వరం" అనే అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే దిశగా బీజేపీ అడుగులు వేస్తున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పార్టీ తుది అభ్యర్థి ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

